SAAKSHI 13 AUG 09

# ఆనందంతో సమాజశ్రేయస్సు: వాస్‌దేవ్



జగ్గి వాస్‌దేవ్

యూసుఫ్‌గూడ, న్యూస్‌లైన్: ప్రతి మనిషి ఆనందంతో ఉన్నప్పుడే సమాజం శాంతిసౌఖ్యాలతో విరాజిల్లుతుందని ఇషా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సద్గురు జగ్గి వాస్‌దేవ్ చెప్పారు. అనందం అనే అల ప్రతి మనిషి జీవితంలోకి వస్తేనే జీవితం సుఖశాంతుల మయం అవుతుందని అన్నారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన యోగా మెడిటేటర్ల సత్సంగ్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆనందం ఎలా ఉద్భవిస్తుందనే విషయం యోగా ద్వారా మాత్రమే తెలుసుకోగలమన్నారు. ఈ సత్యాన్ని అందరికీ తెలియజేయడమే తమ ఉద్దేశమన్నారు. యోగాతో శారీరక, మానసిక వ్యాధులు సైతం నయమవుతాయన్నారు. అంతర, బాహ్య వ్యాధులు పూర్తిగా అంతరించి పోతే ఆనందం దానంతటఅదే వస్తుందన్నారు. ఆనందం మీ వెంట ఉంటే సమాజంలో ఎన్నో మార్పులు సంభవిస్తాయని, చెడు మీచెంతకు చేరదన్నారు. దేశ విదేశాల్లో పర్యటిస్తూ ప్రతి ఒక్కరికీ అంతర, బాహ్య ఆనందాన్ని వివరించానని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో మే నెల 13వ తేదీన ప్రారంభించిన ఆనందఅల మూడు నెలలుగా హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల్లో 75 కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇందులో ప్రముఖ సినీనటులు, మీడియా ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్, విద్యార్థులు, గృహిణులే కాకుండా ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు దాదాపు 500 మంది పాల్గొన్నారన్నారు. ప్రస్తుత ఆనంద సంగమంలో రాష్ట్రంలోని ఐదువేల మంది వరకు పాల్గొంటున్నారన్నారు. తొలుత శాంభవి మహాముద్ర అనే ప్రక్రియను చేశారు. అనంతరం ఇషా బ్యాండ్ ద్వారా సంగీతాన్ని వినిపించారు. అనంతరం యోగా ప్రక్రియను ప్రారంభించారు. కార్యక్రమానికి గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల నుంచి వందలాది మంది ఆనంద అల సభ్యులు హాజరయ్యారు.